సాక్షి చిత్తూరు

మంగళవారం । 2 । జూలై । 2024



ప్రయోగాత్మకంగా 'గజ ప్రజా'

అటవీశాఖ సేవలను ప్రజలకు సులభతరంగా అందించేందుకు ప్రయోగాత్మకంగా గజ ప్రజా యాప్ రూపొందించారు. - 8లో



సమస్యల పరిష్కారానికి వినతులు

చిత్తూరులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కింద కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. - 8లో



సీజనల్ వ్యాధులపై అవగాహన

చిత్తూరులోని పీసీఆర్ పాఠశాలలో సీజనల్ వ్యాధులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

'పరిష్కార వేదిక'కు గైర్హాజరైతే చర్యలు



సుమిత్‌కుమార్ గాంధీ, కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ హెచ్చరించారు. ఎవరు పట్టించుకుంటారులే అని ఎవరైనా అలసత్వం వహిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సోమవారం చేపట్టిన పరిష్కార వేదికకు పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై వారి ఆటలు సాగవని, తానే స్వయంగా అటెండెన్స్ వేస్తానని, ఉన్నతాధికారులు రాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపితే చర్యలు తీవ్రంగా ఉంటాయని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం రేపు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాపరిషత్ 1–7 స్థాయీ సంఘాల సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు సీఈఓ గ్లోరియా తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సమావేశం ఉంటుందన్నారు. ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, విద్య తదితర అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. సంబంధితశాఖల అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు.

4న కుప్పంలో 'పరిష్కార వేదిక'

చిత్తూరు కలెక్టరేట్/కుప్పం : జిల్లాలోని కుప్పం నియోజకవర్గంలో ఈ నెల 4వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతు కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

గుర్తింపు కార్డులకు దరఖాస్తులు

– విభిన్నప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని హిజ్రాలు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విభిన్నప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న హిజ్రాలకు ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్ యాక్ట్ 2019, నిబంధనలు 2020 ప్రకారం కలెక్టర్ ద్వారా గుర్తింపు కార్డులు అందించనున్నట్లు వెల్లడించారు. గుర్తింపు కార్డులు పొందని వారు ఉంటే www.trnsgender.dosje.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పెన్షన్ల పంపిణీ మళ్లీ మొదటికొచ్చింది. ఐదేళ్ల క్రితం టీడీపీ పాలనలో వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ల కోసం పడ్డ కష్టాలు మళ్లీ కళ్లెదుట మెదలాడాయి. ఎన్నికల ముందు వలంటీర్లు లేకపోయినా ఇంటి వద్దకే పెన్షన్లు ఇస్తామన్న కూటమి పెద్దలు సోమవారం సచివాలయాలు, నడివీధుల్లో గంటలు తరబడి నిల్చోబెట్టి పంపిణీ చేశారు. ఈ పరిస్థితిని చూసి లబ్ధిదారులు 'ఏందయ్యా.. ఇంటికే తెచ్చి ఇస్తామన్నారు కదా? మళ్లీ ఏమైంది. ఇందుకేనా మేము ఓట్లేసింది' అంటూ నిట్టూర్చడం కనిపించింది. దీనికితోడు గంటల తరబడి వేచి ఉంచి.. కూటమి నేతల సొంత డబ్బు ఇచ్చినట్లు హడావుడిచేయడం విమర్శలకు తావిచ్చింది.



చంద్రగిరి మండలం, నాగాలచెరువు గ్రామ రచ్చ బండ వద్ద ఉదయం 11 గంటల సమయంలో పింఛను కోసం వేచి ఉన్న లబ్ధిదారులు



ఏర్పేడు మండలం, చెన్నంపల్లిలో ఫింఛన్ల కోసం ఎదురుచూపు

ఇంటింటికీ మంగళం

సాక్షి టాస్క్‌ఫోర్స్

పింఛన్ల పంపిణీ మళ్లీ మొదటికి

- వృద్ధులు, దివ్యాంగులకు తప్పని తిప్పలు
- గంటల తరబడి క్యూలో నిరీక్షణ
- ఇంటింటికీ కాదు.. సచివాలయాలు, నడివీధిలోనే..
- స్థానిక ఎమ్మెల్యేలు వచ్చే వరకు వేచి ఉన్న లబ్ధిదారులు
- అధికారిక కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా మార్చిన కూటమి నేతలు



తిరుపతిలోని సప్తగిరి నగర్‌లో ఓ ఇంటి వద్ద పింఛన్ కోసం గుమికూడిన లబ్ధిదారులు

సాక్షి, తిరుపతి టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సోమవారం ఉదయం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం తీవ్ర ఒడిదుడుకుల నడుమ ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఐదేళ్ల పాటు వలంటీర్లు వేకువజామునే లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి తలుపు తట్టి పెన్షన్ ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చేపట్టిన మొదటి నెల పింఛన్ల పంపిణీ అందుకు విరుద్ధంగా సాగింది. సచివాలయ సిబ్బంది చేత ఇంటింటికీ పంపిణీ చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వ పెద్దలు.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారు. వేకువజామున 5.30 గంటల నుంచి సచివాలయాల ద్వారా పింఛన్ల పంపిణీ ఉంటుందని లబ్ధిదారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న లబ్ధిదారులు ఇంటికే వచ్చి ఇస్తామన్నారు కదా? మళ్లీ ఇదేం పంచాయితీ అనడంతో.. లేదు లేదు లబ్ధిదారుల నివాసానికే వచ్చి ఇస్తామని చెప్పారు. విషయం తెలియని వారు అనేక మంది లబ్ధిదారులు వేకువజాము 5.30 గంటలకే సచివాలయాలకు చేరుకున్నారు. మరికొందరు ఇంటివద్దే వేచి ఉన్నారు. ఉదయం 6 గంటలు దాటుతున్నా సచివాలయ సిబ్బంది, ఆశావర్కర్లు కనిపించకపోవడంతో వీధుల్లో గుంపులు గుంపులుగా వేచి చూశారు. మరికొన్ని చోట్ల స్థానిక ఎమ్మెల్యే పింఛన్ల పంపిణీ చేస్తారని.. లబ్ధిదారులంతా ఓ చోటుకు రావాలంటూ సమాచారం ఇచ్చారు. ఒక చోట అలా.. ఇంకో చోట మరోలా పింఛన్ల పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ ఇబ్బందులు చాలవన్నట్టు.. సర్వర్లు మొరాయించడంతో పింఛన్ల నగదు తీసుకునేందుకు వృద్ధులు, వికలాంగులు మరింత సమయం వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

పార్టీ కార్యక్రమాన్ని తలపించిన పింఛన్ల పంపిణీ

ప్రభుత్వం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ కాస్త కూటమి పార్టీల కార్యక్రమంలా మారింది. స్థానిక ఎమ్మెల్యేలు, నాయకులు సమావేశాలు ఏర్పాటు చేసి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యేలచేత పింఛన్ల పంపిణీ చేపట్టిన ప్రాంతాల్లో వృద్ధులు, వికలాంగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అనేక మంది ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీ ప్రారంభ కార్యక్రమానికి ఆలస్యంగా రావడం.. మరి కొంతమంది ఎమ్మెల్యేలు ఒకే రోజు నియోజకవర్గంలోని ముఖ్యమైన పంచాయతీలు, మండల కేంద్రాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనడంతో లబ్ధిదారులు ఇక్కట్లు పడాల్సి వచ్చింది. ఎమ్మెల్యేలు ఒక చోట పంపిణీ ప్రారంభించిన తరువాత మరొక చోటుకు వెళ్లే వరకు వృద్ధులు, దివ్యాంగులు వేచి ఉండక తప్పలేదు. అలా అనేక చోట్ల ఎమ్మెల్యేల కారణంగా లబ్ధిదారులకు తిప్పలు పడాల్సి వచ్చింది. మరోవైపు ఎమ్మెల్యేలు లేకపోయినా.. ఏ హోదా లేని కూటమి నేతలు అధికారక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలే పింఛన్ల పంపిణీ చేపట్టారు. పింఛన్ల పంపిణీ కోసం కూటమి శ్రేణులు నేనా? నువ్వా? అన్నట్టు పోటీపడ్డారు. తిరుమల బాలాజీ నగర్‌లో చేపట్టిన పంపిణీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటో లేకపోవడంతో జనసేన శ్రేణులు కార్యక్రమానికి దూరంగా ఉండిపోయారు. ఇదిలావుండగా.. సోమవారం రాత్రి 7గంటల సమయానికి తిరుపతి జిల్లా వ్యాప్తంగా 95.19శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు కలెక్టర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. మొత్తం 2,69,162 మంది లబ్ధిదారులకు గాను 2,56,202 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు వెల్లడించారు. మిగిలిన వారికి మంగళవారం పింఛన్లు అందిస్తామని ఆయన వెల్లడించారు. కాగా వడమాలపేటలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. చిత్తూరు జిల్లాలో 2,71,253 మందికిగాను రూ.181 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా.. సాయంత్రం 6 గంటలకు 2,53,287 మందికి రూ.169 కోట్లు పంపిణీ చేశారు. అంటే.. చిత్తూరు జిల్లాలో 93.38శాతం పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన వారికి మంగళవారం అందిస్తామని స్పష్టం చేశారు.



కట్టకింద ఊరులో సర్వర్ పని చేయక నిరీక్షిస్తున్న పండుటాకులు



తిరుపతిలోని బ్రాహ్మణవీధి, బజారు వీధిలో సర్వర్ పనిచేయక ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



ఏర్పేడు: చెన్నంపల్లిలో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



తిరుపతి : సచివాలయ ఉద్యోగి వెంట వెళ్తున్న లబ్ధిదారులు



తిరుపతి : ఉదయం నుంచి ఇంటి వద్దే నిరీక్షిస్తున్న లబ్ధిదారు



తిరుపతి : 33వ డివిజన్ సచివాలయం వద్ద నిరీక్షణ

అమ్మో.. అతిసార



- పెరుగుతున్న డయేరియా కేసులు
- వణికిస్తున్న సీజనల్ వ్యాధులు
- పారిశుద్ధ్యలోపంతో వ్యాప్తి చెందుతున్న రోగాలు
- పట్టించుకోని వైద్యఆరోగ్యశాఖ అధికారులు

జిల్లాలో అతిసార బాధితులు పెరిగిపోతున్నారు. వందలాది మంది ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. ఈ క్రమంలోనే సీజనల్ వ్యాధులతో మరింత మంది మంచాన పడుతున్నారు. జలుబు.. జ్వరంతో నానా అవస్థలు పడుతున్నారు. డయేరియాకు తోడుగా డెంగీ కేసుల సైతం అధికంగా నమోదవుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి దాపురించిందని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. వైద్యఆరోగ్యశాఖ అధికారుల అలసత్వంతో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

కాణిపాకం : జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలకు రోగాలు చుట్టుముడుతున్నాయి. డయేరియా డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్క జూన్‌లోనే 372 అతిసార కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వందలాది మంది రోగులు చికిత్స పొందుతున్నారు.. పలమనేరు, సోమల, బైరెడ్డిపల్లె, పాలసముద్రం, గుడుపల్లె, పుత్తూరు, రేణిగుంట తదితర మండలాల్లో అధిక సంఖ్యలో కేసులు వెలుగులోకి వచ్చాయి. వీటిలో కొన్ని ప్రమాదకరంగా మారాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే స్పందించి ఆయా ప్రాంతాల్లోనే క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. మరికొంత మందిని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి వైద్యం చేయించారు. కోలుకునేంత వరకు పర్యవేక్షణలో ఉంచారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ముందస్తు చర్యల విషయంలో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది విఫలమవుతున్నారు.



పుత్తూరులో కాలువలోనే తాగునీటి పైపులు



పూతలపట్టులో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న సిబ్బంది



మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

అధ్వానంగా పారిశుద్ధ్యం

ఇటీవల ఉమ్మడి జిల్లాలో భారీ వర్షపాతం నమోదవుతోంది. చిన్న చిన్న కుంటలు, కాలువలు నిండుకున్నాయి. చెరువులకు నీరు చేరుతోంది. దీంతో పలు కాలువలు, కుంటలు దోమలకు ఆవాసంగా మారిపోయాయి. ప్రధానంగా పల్లెల్లో పారిశుద్ధ్యం లోపం, అపరిశుభ్ర వాతావరణం, పైపుల లీకేజీ కారణంగా తాగునీరు కలుషితమవుతోంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా డ్రైనేజీల్లోనే తాగు నీటి కొళాయిలు, పైపులు దర్శనమిస్తున్నాయి. వీటికి కొన్ని చోట్ల లీకేజీలు ఏర్పడి నీరు కలుషితమై వాంతులు, విరేచనాలకు కారణమవుతోంది. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పారిశుద్ధ్యం విషయంలో శ్రద్ధ వహించడంలేదు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించడం లేదు. పైపులు, కొళాయిల లీకేజీలను అరికట్టడం లేదు. కొంతమంది సిబ్బంది అయితే పల్లెల్లో పర్యటించడం, స్థానిక సమస్యలను పట్టించుకున్న పాపానపోవడం లేదు. ఈకారణంగానే సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. డెంగీ, డయేరియా కేసులు నమోదైనప్పుడు మాత్రం అధికారులు హడావుడి చేసి కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లుతున్నారని చెబుతున్నారు.

అమలు కాని డ్రైడే

ప్రతి శుక్రవారం ఫ్రైడే...డ్రైడేను విధిగా చేపట్టాలనే నిబంధన ఉంది. అయితే 99 శాతం క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం అమలు కావడంలేదు. వైద్య, పంచాయతీ, వార్డు స్థాయిలోని అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. కేవలం ఫొటోలకు ఫోజులిచ్చి తూతుమంత్రంగా డ్రైడే నడిపిస్తున్నారు.

కలుషిత ఆహారం కూడా..

కలుషిత ఆహారం కూడా డయేరియాకు కారణమవుతోంది. వివాహ వేడుకలు, ఇతరత్రా కార్యక్రమాల్లో విందు భోజనాలు చేసి డయేరియాకు గురివుతున్నారు. చికెన్ దుకాణాల్లో చనిపోయిన కోళ్లను కూడా విందులకు పంపించేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కారణంగా విందు విషంగా మారి ప్రజలను ఆస్పత్రి పాలు చేస్తోంది. పలు హోటల్లో కూడా ఇదే తంతు కొనసాగుతోంది. ప్రస్తుతం కూరగాయల రేట్లు పెరగడంతో కుళ్లిన కూరగాయలను తెచ్చి కొన్ని హోటల్లో వండేస్తున్నారు. మరికొన్ని హోటల్లో కూరలు మిగిలితే భద్రపరచి..మరుసటి రోజు కూడా అవే వడిస్తున్నారు. ఇవి కూడా ప్రజలను అనారోగ్య సమస్యల వైపు నెట్టేస్తున్నాయి.

వెంటనే స్పందించాలి



"డయేరియా కేసులు వచ్చిన వెంటనేవైద్యాధికారులు, సిబ్బంది వెంటనే స్పందించాలి. జిల్లా కార్యాలయానికి సమాచారం అందించాలి. ఆ ప్రాంతంలో శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు చూడాలి. ఒక వేళ తీవ్రత అధికంగా ఉంటే ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేయాలి. ప్రతి శుక్రవారం ఫ్రైడే..డ్రైడే చేపట్టాలి. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. డయేరియా వచ్చిన వ్యక్తి వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలి. సొంత వైద్యం వద్దు. ఏం కాదని, తేలికగా తీసుకోవడం మంచిది కాదు. – **ప్రభావతీదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు**

పారిశుద్ధ్యం పర్యవేక్షణ

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యంగా మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా వ్యవహరించాలి. నిత్యం గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలను పర్యవేక్షించాలి. సమస్యలను గుర్తించి పరిష్కరించేలా చూడాలి. తాగునీటిని పరిశుభ్రంగా అందించాలి. 15 రోజులకు ఒకసారి కాలువలు, ట్యాంకులను శుభ్రం చేయాలి. తాగు నీటి పైపు లీకేజీలుంటే వెంటనే మరమ్మతులు చేయించాలి. – **లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి, చిత్తూరు**

పనిచేయని సర్వర్

- పింఛన్‌దారుల ఎదురుచూపులు
- వృద్ధులకు తప్పని ఇక్కట్లు



గుమికూడిన పింఛన్‌దారులు

పాలసముద్రం : సామాజిక పింఛన్ల పంపిణీకి సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం ఉదయం సచివాలయ ఉద్యోగులు ప్రారంభించిన పింఛన్ల పంపిణీకి సర్వర్ కారణంగా అవస్థలు తప్పలేదు. ఈ క్రమంలోనే ఆముదాదలలో స్థానిక టీడీపీ నేత తన ఇంటి వద్దకే వృద్ధులు, దివ్యాంగులను రప్పించి పింఛన్ పంపిణీ చేయడం వివాదాస్పదమైంది. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే థామస్ పలువురికి పెన్షన్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామల శివప్రకాష్‌రాజు, ఎంపీడీఓ రామనాథరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిత్తూరులో ఘర్షణ: ఇద్దరిపై కేసు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఘర్షణకు దిగిన ఇద్దరు వ్యక్తులపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉలసయ్య కథనం మేరకు.. వన్నియర్ బ్లాక్‌కు చెందిన న్యాయవాది కార్తవరాయన్, శరవణకు గతంలో గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఇద్దరూ పరస్పరం కొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కార్తవరాయన్, శరవణపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బంగారుపాళెం: మండలంలోని బంగారుపాళెం –అరగొండ ప్రధాన రహదారిపై వంకమిట్ట వద్ద ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ మల్లికార్జున్ తెలిపారు. వివరాలు.. తవణంపల్లె మండలం అరగొండగొల్లపల్లెకు చెందిన బాలాజీ(30) స్వంతపని ద్విచక్రవాహనంపై బంగారుపాళానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాలాజీ ఘటనా స్థలంలోనే మరణించాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రయోగాత్మకంగా 'గజ ప్రజా'

అటవీశాఖ సేవలను ప్రజలకు సులభతరంగా అందించడానికి గజ ప్రజా యాప్‌ను రూపొందించారు. పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో రెండేళ్ల క్రితం యాప్ పనులకు శ్రీకారం చుట్టారు. త్వరలోనే అందరికీ అందుబాటులో ఉండేలా యాప్‌ను విడుదల చేయనున్నారు. ఏనుగుల దాడిలో బాధితులకు సకాలంలో పరిహారం అందించే వెసులుబాటు కల్పించనున్నారు.

- వినూత్నంగా ప్రవేశపెట్టిన అటవీశాఖ
- పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో అమలు



విజయవాడలో యాప్‌ను టెస్ట్ చేస్తున్న ఉన్నతాధికారులు (ఫైల్)



గజ ప్రజా యాప్ నమూనా

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలో ఏనుగుల కారణంగా ప్రాణ నష్టం సంభవిస్తే బాధిత కుటుంబాలకు వేగంగా పరిహారం అందిస్తున్నారు. కానీ పంట నష్టానికి మాత్రం సదరు రైతులకు పరిహారం అందడం ఆలస్యమవుతోంది. అలాగే ఏనుగులు రాక, వాటి గణన తదితర అంశాలను ప్రజలు సైతం తెలుసుకునేందుకు వీలుగా గజ ప్రజా యాప్‌ను రూపొందించారు. ప్రస్తుతం చివరి దశలో యాప్ పనులు జరుగుతున్నాయి.

పంట నష్టం వాటిల్లితే ఇలా..

ఏనుగుల కారణంగా పంటనష్టం వాటిల్లితే బాధిత రైతులు ముందుగా స్థానిక ఎఫ్‌బీఓకు తెలియజేయాలి. ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎఫ్ఎస్ఓ దృష్టికి తీసుకెళతారు. ఆయన వచ్చి చూశాక ఎఫ్ఆర్ఓకు నివేదిస్తారు. ఎఫ్ఆర్ఓ సందర్శించిన తర్వాత నివేదిక సిద్ధం చేసి, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులకు పంపుతారు. వారు క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి తుది నివేదికను డీఎఫ్ఓకు అందజేస్తారు. ఆయన వాటిని కలెక్టర్ ఆమోదానికి పెట్టి అనుమతి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేస్తారు. మొత్తం ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు దాదాపు 4 నెలలకు పైగా సమయం పడుతుంది. దీంతో సకాలంలో బాధితులకు పరిహారం అందడం ఆలస్యమవుతోంది. అయితే గజ ప్రజా యాప్ ద్వారా పరిహారం పంపిణీ సులభతరంగా మారుతుంది. గజదాడుల్లో పంట నష్టం జరిగిందని రైతులు ఫిర్యాదు చేయగానే ఎఫ్‌బీఓ వెంటనే యాప్‌లో ఫొటోతో సహా వివరాలను అప్‌లోడ్ చేస్తారు. తర్వాత సంబంధిత శాఖల అధికారులకు వివరాల అలెర్ట్ వస్తుంది. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమాచారాన్ని డీఎఫ్ఓకు పంపుతారు. నిధుల విడుదల కోసం నివేదిక పెడతారు. దీంతో త్వరితగతిన పరిహారం మంజూరవుతుంది.

ఇతర ఉపయోగాలు

ఈ క్రమంలోనే ఏనుగుల రాకను గుర్తించిన ఎఫ్‌బీఓ యాప్‌లో సమాచారం అప్‌లోడ్ చేస్తారు. దీంతో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్న వారికి అలర్ట్ వెళుతుంది. అటవీ సిబ్బంది క్షేత్రస్థాయిలో సమాచారాన్ని స్థానికులకు తెలియజేస్తారు. అలాగే ప్రతి ఏడాది జరిగే గజ గణనను కూడ ఈ యాప్‌లో నమోదు చేస్తారు. క్షేత్రస్థాయిలో అందరికి ఉపయోగపడితే తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానం అమలు చేయనున్నారు. వీటిని ఇటీవల డీఎఫ్ఓ చైతన్యకుమార్‌రెడ్డి విజయవాడలో ఉన్నతాధికారుల సమక్షంలో యాప్‌ను టెస్ట్ చేయించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హత, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఖాళీగా ఉన్న పలు కేడర్‌ల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందులో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు 11, మినీ కార్యకర్త–18, హెల్పర్–58 మొత్తం 87 పోస్టులు ఉన్నాయని వెల్లడించారు. సంబంధిత పోస్టుల ఖాళీల వివరాలను జిల్లాలోని అన్ని సీడీపీఓ కార్యాలయాలకు పంపినట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ, వార్డు సచివాలయ పరిధిలోని పదోతరగతి పూర్తి చేసిన వివాహిత మహిళలు ఈ నెల 4 నుంచి 19 వ తేదీలోపు సీడీపీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు సీడీపీఓ కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

పలమనేరు : మండలంలోని సాకేవూరు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. దిగువ మారుమూరుకు చెందిన సోమిరెడ్డి (65) బైక్‌పై బైరెడ్డిపల్లె నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గం మధ్యలో ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు విచారిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి మాట్లాడుతూ ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 1 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు డయేరియా నిర్మూలన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. 0–5 ఏళ్ల లోపు పిల్లలు వ్యాధుల బారిన పడకుండా తల్లిదండ్రులకు జాగ్రత్తలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా డయేరియా, డెంగీ వ్యాధుల తీవ్రతను తెలుసుకోవాలన్నారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థులు తమ ఇళ్ల వద్ద మరికొంత మందికి తెలియజేయాలని కోరారు. డీఈఓ దేవరాజు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా స్టాప్ డయేరియా, డెంగీ నివారణ వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



బాధితుల సమస్య వింటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు కలెక్టరేట్ : సమస్యల పరిష్కారం కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు వినతులు సమర్పించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వారు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. పలువురు కలెక్టరేట్ ఎదుట సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన చేపట్టారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ వినతులను స్వీకరించారు. వివి దశాఖలకు సంబంధించి మొత్తం 104 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందజేసిన వినతులను పరిశీలించి తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలుషిత నీటిపై..



కలుషిత నీటిని చూపుతున్న చైతన్య

కలుషిత నీటి సమస్యపై మన చిత్తూరు అభివృద్ధి వేదిక నాయకుడు చైతన్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరులోని పరిశ్రమలు నుంచి వచ్చే వ్యర్థాల వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయన్నారు. పోతంబట్టు కాలనీలో బోరు నుంచి రంగు మారిన నీరు వస్తోందని తెలిపారు. రిక్షా కాలనీ లో సైతం ఇదే సమస్య ఉందన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కరించాలని కోరారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 32 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్:చిత్తూరు నగరంలో సోమవారం నిర్వహించిన పోలీసుశాఖ గ్రీవెన్స్‌డేకు మొత్తం 32 ఫిర్యాదులు అందాయి. ఏఆర్ కార్యాలయంలో ఎస్పీ మణికంఠ వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, ప్రేమ వివాహం, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. వచ్చిన వినతులను ఆన్‌లైన్‌లో నమోదుచేసి, క్షేత్రస్థాయిలో విచారించా లని అధికారులను ఎస్పీ ఆదేశించారు. అలాగే ఏఎస్పీ ఆరీఫుల్లా, దిశ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సైతం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

క్షేత్రస్థాయిలో న్యాయం కోసం..



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కె.గొల్లపల్లె వాసులు

క్షేత్రస్థాయిలో తమ సమస్యకు న్యాయం జరగడం లేదని, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని పెనుమూరు మండలం కె.గొల్లపల్లె వాసులు వాపోయారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. గ్రామస్తుడు పురుషోత్తం మాట్లాడుతూ స్థానిక భూస్వాములు అన్యాయంగా వంకను పూడ్చివేశారని ఆరోపించాడు. దీంతో పంట పొల్లాలోకి నీరు చేరుతోందని ఆందోళన వ్యక్తం చేశాడు. పంట నీటిపాలయ్యే ప్రమాదముందని వివరించాడు. జిల్లా ఉన్నతాధికారులు సర్వే చేయించి న్యాయం చేయాలని విన్నవించాడు.

వేతన బకాయిల కోసం..



ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

జిల్లాలోని పంచాయతీల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ గ్రీన్ అంబాసిడర్లకు 25 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికుల వేతనాలు పెండింగ్ పెట్టడం దారుణమన్నారు. కనీస వేతనం రూ.10 వేలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు గోవిందస్వామి, చంద్ర, రమాదేవి పాల్గొన్నారు.

రీజినల్ విజిలెన్స్ ఎస్పీగా కరీముల్లా షరీఫ్

చిత్తూరు అర్బన్: తిరుపతి ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా విజయవాడలో ఉన్న కరీముల్లా షరీఫ్ (నాన్ క్యాడర్ ఎస్పీ)కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్త సోమవారం ఆదేశాలు జారీ చేశారు. తిరుపతిలో పనిచేస్తున్న అదనపు ఎస్పీ కె.ఈశ్వర్‌రెడ్డిను మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

93.38 శాతం పింఛన్ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మొత్తం 93.38 శాతం సామాజిక పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ తులసి వెల్లడించారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు పకడ్బందీగా పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. సోమవారం రాత్రి 7.20 గంటల వరకు మొత్తం 2,71,253 మందికి గాను 2,53,287 మందికి నగదు అందించినట్లు వివరించారు. మరో 17,966 మందికి పింఛన్ పంపిణీ చేయాల్సి ఉందని తెలిపారు.

ఐటీఐలో అడ్మిషన్లకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్:జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో రెండో విడత అడ్మి షన్లకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రవీంద్రరెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 7 ప్రభుత్వ, 10 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో అడ్మిషన్ పొందే వెసులుబాటు ఉందన్నారు. www.iti. ap.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు సమర్పించవచ్చని వెల్లడించారు. రెండో విడతలో అడ్మిషన్‌కు దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వ కళాశాలలకు 27, 28 ప్రైవేట్ కళాశాలలకు 29,30 తేదీల్లో సంప్రదించాలని సూచించారు.

మైనారిటీ ఐటీఐలో..

పుంగనూరు : మైనారిటీ ఐటీఐలో ప్రవేశానికి ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఒక సంవత్సరం కోర్సుల్లో మెకానిక్ డీజిల్, వెల్డర్, ఫ్యాషన్‌డిజైనింగ్ ఉన్నాయన్నారు. రెండేళ్ల కోర్సుల్లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మన్ సివిల్, మోటారు వెహికల్ మెకానిక్ ఉన్నాయని వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని కోరారు. ఇతర వివరాలను కళాశాలలోనే సంప్రదించాలని సూచించారు.

డిప్యూటీ సర్వేయర్ సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని శాంతిపురం మండలం డిప్యూటీ సర్వేయర్ సద్దాం హుస్సేన్‌ను సస్పెండ్ చేసినట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు వెల్లడించారు. సోమవారం ఈ మేరకు ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత నెల 27వ తేదీన ఓ రైతు పొలం సర్వే చేసేందుకు సద్దాంహుస్సేన్ రూ.లక్ష డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. బాధిత రైతు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందించినట్లు వివరించారు. దీనిపై విచారణ చేయించామని, వాస్తవమని తేలడంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు.

8న వరసిద్ధుని హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈ నెల 8వ తేదీన హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు ఈఓ వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభించనున్న లెక్కింపు కార్యక్రమానికి ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

అంతర్రాష్ట్ర 'ఎర్ర' స్మగ్లర్ అరెస్ట్

- తలకోన అడవుల్లో ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- కొనసాగుతున్న కూంబింగ్

భాకరాపేట : అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకుని తిరుపతి రెడ్ శ్యాండల్ కోర్టులో హాజరు పరచినట్లు భాకరాపేట ఫారెస్ట్ రేంజర్ దత్తాత్రేయ తెలిపారు. ఆయన కథనం..కార్యాలయానికి అందిన రహస్య సమాచారం మేరకు సోమవారం తలకోన సౌత్ బీట్‌లో కూంబింగ్ నిర్వహించారు. ఈ కూంబింగ్‌లో 116 కేజీలు బరువు గల 7 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ వీరిని గమనించి పారిపోయిన ఆరుగురు స్మగ్లర్ల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. అలాగే కర్ణాటక రాష్ట్రం హోస్‌కోటకు చెందిన స్మగ్లర్ సలావుద్దీన్‌ఖాన్ అదుపులోకి తీసుకున్నారు. తలకోన అడవుల్లో ఎర్రచందనం స్మగ్లర్లు తిష్ఠ వేసినట్లు సమాచారం ఉండడంతో కూంబింగ్ కొనసాగిస్తున్నారు. దాడుల్లో ఎఫ్ఎస్ఓ సలాఉద్దీన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు నిఖిల్, రాజేష్, ప్రదీప్‌చంద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ అర్చకులు, ఆగమ సలహాదారులతో సమీక్ష



ఆగమ సలహాదారులు, అర్చకులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుమల: శ్రీవారి ఆలయానికి సంబంధించిన పలు ఆచార వ్యవహారాలు, వైఖానస ఆగమోపచారాలు, పలు అంశాలపై ఆలయ అర్చకులు, ఆగమ పండితులతో టీటీడీ ఈఓ జె.శ్యామలరావు సమీక్షించారు. సమీక్షలో జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, ఆగమ సలహాదారులు, ప్రధాన అర్చకులు, తిరుమల శ్రీవారి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు తిరుమలలో వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా జరుగుతున్న వివిధ ఆచారాలు, కైంకర్యాల గురించి ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు, శ్రీకృష్ణ శేషాచల దీక్షితులు, గోవిందరాజ దీక్షితులు ఈఓకు వివరించారు. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలోని వేద విద్యార్థులకు అప్రెంటీస్‌గా అవకాశం కల్పించి, వారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అర్చకులు ఈఓను కోరారు. గతంలో ప్రతి సోమవారం ఆర్జిత సేవగా నిర్వహించే విశేష సేవను కనీసం ఏడాదిలో ఒక్కసారైనా నిర్వహించాలని ఈఓను కోరారు. అనంతరం తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామి ఆలయానికి చెందిన శ్రీనివాస దీక్షితులు మాట్లాడుతూ, కోవిడ్ కాలంలో తగ్గించిన ప్రసాద దిట్టం ఇంకా కొనసాగుతూనే ఉందని, దానిని పెంచాలని ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆగమ సలహాదారులు ఆలయం ప్రతిష్ఠకు భంగం కలుగకుండా పురాతన సంప్రదాయాలు పరిరక్షించడంలో, ఆచారాలకు విఘాతం కలుగకుండా చూసుకోవడంలో తమ పాత్రను ఈఓ కు తెలియజేశారు. ఈ సమావేశాల అనంతరం శ్రీవారి అన్నప్రసాదాలపై ఆలయ, పోటు అధికారులతో ఈఓ సమీక్షించారు. సమావేశంలో ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, సీతారామాచార్యులు, శ్రీరామకృష్ణ దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, పోటు పేష్కార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన ఇల్లు

నాగలాపురం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన సోమవారం మండలంలోని తూర్పు దళిత వాడలో చోటుచేసుకుంది. స్థానిక రెవెన్యూ అధికారుల కథనం.. తూర్పు దళితవాడకు చెందిన లక్ష్మణన్ ఇంట్లో ఆదివారం రాత్రి రెండు, మూడు సార్లు విద్యుత్ అంతరాయం కలిగింది. అనంతరం 15 నిమిషాల తరువాత విద్యుత్ సరఫరా రావడంతో ఇంట్లోని ఏసీ వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక్కసారిగా మంటలంటుకున్నాయి. ఆ తర్వాత ఇంట్లోని విద్యుత్ తీగలన్నీ కాలిపోయాయి. ఇంట్లోని వస్తువులు సైతం కాలిబూడిదయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న లక్ష్మణన్, అతని భార్య, ఇద్దరు పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో 50 వేల రూపాయల నగదు, 10 సవరాల బంగారం, 50 వేల విలువగల దుస్తులు, లక్ష విలువ గల మంచం, ఫ్రిడ్జి, మిక్సీ, గ్రైండర్, వాషింగ్ మిషన్ తదితర గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఘటనా స్థలాన్ని సోమవారం తహసీల్దారు నరసింహులు, ఎంపీడీఓ పీఎంకే. బాబు, నాగభూషణం పరిశీలించి, వివరాలను సేకరించారు. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. ఆపై బాధిత కుటుంబానికి రెవిన్యూ అధికారులు 50 కిలోల బియ్యం అందించారు. అలాగే విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు.